

# అది ఎవరు

*హడావుడిగా పోలీస్‌స్టేషన్‌కు బయల్దేరాడు గౌతమ్. అప్పటికే అతని రాకకోసం ఇన్‌స్పెక్టర్ ఎదురుచూస్తున్నాడు. స్టేషన్‌కు చేరుకోగానే 'సుధ భర్తను నేనే సార్' అంటూ బోరున విలపించాడు. ఇన్‌స్పెక్టర్ అతణ్ని ఓదారుస్తూ.. 'మిస్టర్ గౌతమ్! మీకు ఎవరైనా శత్రువులు ఉన్నారా? మీ భార్యను దారుణంగా చంపారు. మీరిచ్చే సమాచారం ఆధారంగానే నేరస్తులను పట్టుకోగలం' అని ప్రశ్నించాడు. గౌతమ్ బొంగురు గొంతుతో.. 'అంతా ఆవిడే చేసుంటుంది సార్.. అప్పటికీ మా ఆవిడతో చెబుతూనే ఉన్నాను..' అని మళ్లీ కన్నీటి పర్యంతం అయ్యాడు. 'నా భార్య లేకుండా నేను బతుకలేను.. ' అనుకుంటూ విలవిల్లాడిపోయాడు.*

హత్యకు గురైన సుధ ఎవరు? ఆమె కథేంటి?

సుధ, గౌతమ్ కొత్తగా పెండ్లి అయిన జంట. పెద్దల సమక్షంలో అంగరంగ వైభవంగా వారిద్దరి వివాహం జరిగింది. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లే! ఒకరికోసం ఒకరు పుట్టారన్నట్టుగా ఉండేవారు. ఇద్దరి ఆఫీసులూ హైటెక్ సిటీలోనే! కొత్తజంట కోటి ఆశలతో సంసార జీవితం ప్రారంభించింది. ఆర్థికంగా ఏ లోటూ లేదు. ఓ ఫ్లాట్ అద్దెకు తీసుకున్నారు. ఆఫీస్‌కు ఇద్దరూ కలిసే వెళ్లేవాళ్లు. కలిసే వచ్చేవాళ్లు. ఈ ఇద్దరి అన్యోన్యత చూసి చుట్టుపక్కల ఫ్లాట్లలోని అమ్మలక్కలు ముసిముసిగా నవ్వుకునేవాళ్లు. కుళ్లుకునే కండ్లూ ఉండేవి. ఇవేవీ పట్టించుకోకుండా ఇద్దరిదీ ఒకే లోకం అన్నట్టుగా వ్యవహరించేవాళ్లు సుధ అండ్ గౌతమ్.

సుధ చాలా పాజిటివ్ మనిషి. ఇరుగు పొరుగువారితో కలివిడిగా మాట్లాడేది. ఇరుగమ్మ, పొరుగమ్మతో ఇట్టే కలిసిపోయేది. తాను వర్కింగ్ ఉమెన్ అన్న గర్వం ఆమెలో అణువంతైనా ఉండేది కాదు.
ఆ స్వభావమే.. ఆమెను అందరికీ దగ్గరికి చేసింది. కొన్నాళ్లు హాయిగా గడిచాయి. ఏమైందో గానీ, ఎప్పుడూ ఆప్యాయంగా పలకరించే పక్కింటి రాగిణి వైఖరిలో అనుకోని మార్పు వచ్చింది. ప్రతి చిన్న విషయానికీ సుధను విసుక్కోసాగింది. పొద్దున కారిడార్‌లో ముగ్గు వేసినా, చెట్లకు నీళ్లు పోసినా.. గోరంతలు కొండంతలు చేయసాగింది రాగిణి. ఏదో ఒక సాకుతో గొడవకు దిగడం మొదలుపెట్టింది. ఎప్పుడూ నవ్వుతూ, తన చుట్టూ ఉన్నవారిని నవ్విస్తూ ఉండే సుధ ముభావంగా మారిపోయింది. అప్పటికీ, రాగిణితో సఖ్యతగా ఉండటానికి ఎన్నోసార్లు ప్రయత్నించింది. కానీ, ఆమెది విఫల ప్రయత్నమే అయింది. దీంతో సహనం కోల్పోయిన సుధ.. రాగిణి వ్యవహారం గురించి గౌతమ్‌కి ఎట్టకేలకు చెప్పింది. దీంతో గౌతమ్.. రాగిణికి ఆవిడ భర్త సుధాకర్‌కి నచ్చచెప్పాలని చూశాడు. కానీ, అదీ లాభం లేకుండా పోయింది. రోజు రోజుకీ వీరి గొడవలు ఎక్కువవసాగాయి.

ఒక రోజు ఆఫీస్ నుంచి ఇంటికి వెళ్తూ.. సుధను పికప్ చేసుకున్నాడు గౌతమ్. దిగాలుగా ఉన్న భర్త ముఖం చూసి 'ఎందుకు అలా ఉన్నారు?' అని అడిగింది సుధ.

# కారులో శవం



'ఈసారి ఆఫీస్ ట్రిప్ నా నెత్తిన పడింది. మూడు రోజులు! తప్పించుకోవాలని చాలా ట్రై చేశాను. సారీ బేబీ! కుదరలేదు' అన్నాడు గౌతమ్. 'తను లేకుండా మూడు రోజులు ఉండాలా?' అని మనసులో అనుకుంటూనే.. 'ఫర్వాలేదు డియర్! ఓన్లీ త్రీ డేస్ కదా!' అని బాధపడుతున్న భర్తను అనునయించింది సుధ.

ట్రైన్ టికెట్స్ ఆల్రెడీ బుక్ అయ్యాయి. లగేజీ సర్దుతున్నంత సేపూ భార్యకు జాగ్రత్తలు చెబుతూనే ఉన్నాడు గౌతమ్. 'సమయానికి తిను. కంగారుపడకు. రాగిణి వాళ్లు ఏమన్నా పట్టించుకోకు' అని చెప్పి బయల్దేరాడు. భర్త లేని మూడు రోజులు సుధకు మూడు యుగాలుగా అనిపించింది. రోజూ తనతో ఫోన్‌లో మాట్లాడుదామంటే, ట్రైనింగ్ సమయంలో గౌతమ్ ఫోన్‌లో అందుబాటులో ఉండేవాడు కాదు. ట్రైనింగ్ పూర్తయ్యాక రాత్రి మాత్రమే మాట్లాడే వెసులుబాటు ఉండేది. ప్రతి రాత్రీ సరదాగా మాట్లాడుకునేవారు. పొద్దంతా నిస్తేజంగా ఉన్నా.. గౌతమ్ కాల్ రాగానే ఆమెకు ఎక్కడ లేని ఉత్సాహం వచ్చేది. దిగులంతా మర్చిపోయేది. తొలి రెండు రోజులూ ఇద్దరు ఎంచక్కా ముచ్చటించుకొన్నారు.

మూడోరోజు రాత్రి గౌతమ్ సుధకు ఫోన్ చేస్తే, ఆమె లిఫ్ట్ చెయ్యలేదు. దీంతో గాభరా పడిపోయిన గౌతమ్, ఆ మరుసటిరోజే ట్రైనింగ్ ముగించుకొని ఇంటికి తిరిగొచ్చాడు. ఇంట్లో సుధ కనిపించలేదు. కారు కూడా లేకపోవడంతో మార్కెట్‌కి వెళ్లిందని సుధకు మరోసారి ఫోన్ చేయబోతుండగా.. గౌతమ్ ఫోన్ రింగ్ అయింది. ఫోన్ లిఫ్ట్ చేశాడు గౌతమ్. ''హలో! సర్.. మీ భార్యను ఎవరో హత్య చేశారు. ఆమె డెడ్‌బాడీ కారులో దొరికింది. వెంటనే పోలీస్ స్టేషన్‌కి రండి..'' అని చెప్పి అవతలి వ్యక్తి ఫోన్ కట్ చేశాడు. వెంటనే, గౌతమ్ పరుగు పరుగున పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఇన్‌స్పెక్టర్ రుద్ర ముందు కూలబడ్డాడు. ''ఎవరు సర్. నా భార్యను హత్య చేసింది?'' అంటూ ఏడవసాగాడు. అప్పుడు ఇన్‌స్పెక్టర్ ''మీకు ఎవరిపైనైనా అనుమానం ఉందా?'' అని అడిగాడు. గౌతమ్ కళ్లు తుడుచుకొని రాగిణీ వాళ్లతో తరుచూ అయ్యే గొడవలు, సుధను ఒంటరిగా వదిలి తాను ట్రైనింగ్‌కి వెళ్లిన విషయం, మూడోరోజు రాత్రి ఆమె ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం.. ఇలా అన్నీ చెప్పాడు.

తర్వాత, ఇన్‌స్పెక్టర్ దీర్ఘంగా నిట్టూర్చి అక్కడున్న కానిస్టేబుల్‌తో ''ఇతణ్ని అరెస్ట్ చేయండి. ఇతనే హంతకుడు'' అని చెప్పాడు. గౌతమే ఆ హత్య చేశాడని ఇన్‌స్పెక్టర్ ఎలా కనిపెట్టాడో మీరు చెప్పగలరా? ■

**సమాధానం.. 28వ పేజీలో**

... రాజశేఖర్ కడవేర్గు